ఆరోగ్యానికి 'రుచి'ంచేలా..

- కుప్పంలో పదేళ్ల తర్వాత నిండిన చెరువులు
- తాజా చేపలతో రుచితో పాటు ఆరోగ్యం
- పలువురికి ఉపాధి.. పంచాయతీకి ఆదాయం
- అధిక సంఖ్యలో వెలిసిన చేపల ఫ్రై దుకాణాలు


కుప్పంలో మార్కెట్‌లో వివిధ రకాల చేపలు


చేపల దుకాణంతో ఉపాధి పొందుతున్న మహిళ

కుప్పం రూరల్: కుప్పం ప్రాంత చెరువుల్లో దొరికే కట్లా, రోగ్, బంగారుతీగ, కుచ్చులు, కొరదలు చాలా రుచిగా ఉంటాయి. పదేళ్లుగా వర్షాలు లేకపోవడంతో చేపల రుచికి కుప్పం వాసులు దూరమయ్యారు. గత ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసి చెరువులు నిండడంతో చేపల పెంపకం పెరిగింది. నిత్యం మార్కెట్‌కు వచ్చే తాజా చేపలతో మాంసం ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు చేపల వేపుడు దుకాణాలతో మహిళలు ఉపాధి పొందుతున్నారు.

ఎన్నేళ్లకు..

పది సంవత్సరాలుగా వర్షాలు సక్రమంగా లేకపోవడంతో చెరువుల్లో నీళ్లు లేక చేపలు ఉండేవి కావు. ఆరు నెలలకు ముందు కుప్పం నియోజకవర్గంలో భారీ వర్షాలు నమోదు కావడంతో 70 శాతం చెరువులు నిండి మొరవలు పోయాయి. దీంతో స్థానికులు చెరువులో చేపల పిల్లలను వదిలారు. మున్సిపాలిటీ, పంచాయతీ పరిధిలోని చెరువులను అయితే వేలం పాటలో ఉత్సాహంగా పాల్గొని లక్షలు వెచ్చించి మరీ సొంతం చేసుకున్నారు. ఈ చెరువుల్లో ఒక్కో చేప పిల్ల రూ. 2 నుంచి రూ. 5 వరకు కొనుగోలు చేసి వదిలారు. చేపలు పెరిగి ప్రస్తుతం దిగుబడి వచ్చింది. ఒక్కో చేప కిలో నుంచి పది కిలోల వరకు రావడంతో వీటిని కొనేందుకు మాంస ప్రియులు నిత్యం దుకాణాల ముందు క్యూ కడుతున్నారు. పదేళ్లుగా సముద్రపు చేపలతో విసిగిపోయిన వీరికి స్థానిక చెరువు చేపలు లభించడంతో ఎగబడుతున్నారు. బంగారుతీగ కిలో రూ.120 వస్తుండడంతో పేదలు సైతం మటన్, చికెన్‌ను వదిలి చేపల వైపు మళ్లుతున్నారు.

మహిళలకు ఉపాధి

తమిళనాడు తరహాలో కుప్పంలో సైతం చేపల ఫ్రై దుకాణాలు వందల సంఖ్యలో వెలిశాయి. స్థానికంగా చేపలు దొరుకుతుండడంతో మహిళలు చెరువుల వద్దకు వెళ్లి పది, ఇరవై కిలో వంతున కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లోనే దుకాణాలు పెట్టుకుని ఉపాధి పొందుతున్నారు. కుప్పం–క్రిష్ణగిరి రహదారిలో 20కి పైగా ఫ్రై దుకాణాలు వెలిశాయంటే ఫ్రై చేపలకు ఎలాంటి డిమాండ్ ఉందో అర్థమవుతుంది.

పంచాయతీలకు ఆదాయం

చెరువులు నిండడంతో ఆయా పంచాయతీ పరిధిలోని చెరువులను చేపల పెంపకానికి వేలం పాట నిర్వహించారు. ఒక్కో పంచాయతీకి లక్షల్లో ఆదాయం వచ్చింది. బుడ్లక్, పాప్‌లెట్ వంటి చేపలు పెంచి బయటి ప్రాంతాలకు సైతం అమ్ముకుని ఉపాధి పొందుతున్నారు.

ఆరోగ్యానికి మంచిదంటున్న వైద్యులు

మాంసం తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుంది.. చికెన్‌ను చాలా మంది ఇష్టపడరు.. చేపలు తినడం ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తుండడంతో ఎక్కువ మంది చేపలు తినేందుకు ఇష్టపడుతున్నారు.

నా ఆశ తీరింది

నాకు చేపలంటే చాలా ఇష్టం. స్థానికంగా లభించకపోవడంతో తమిళనాడులోని వేపనపల్లికి వెళ్లి కొనేవాళ్లం. ప్రస్తుతం మా గ్రామంలోని చెరువుల్లోనే లభిస్తుండడంతో ఇక్కడే తెచ్చుకుని ఇంటిల్లిపాది ఆస్వాదిస్తున్నాం. అందులోనూ సరసమైన ధరలకు దొరుకుతుండడం మంచి పరిణామం.

–గణపతి, గుడ్లనాయనపల్లె

చాలా బాగుంటుంది

మా ఊరిలో దొరికే కట్లా, రోగ్ చేపలు చాలా బాగుంటాయి. పులుసు చేసుకుంటే రెండు రోజులు అయినా తినొచ్చు. సముద్రం చేపలు అయితే రుచి అంతగా ఉండదు. దీంతో ప్రతి ఆదివారం నేను చేపలనే కొనుగోలు చేస్తాను. మా పిల్లలు సైతం చేపలనే ఇష్టంగా తింటారు.

–మునిరాజు, యలాజనూరు

క్లుప్తంగా

నేడు భాస్కర్‌రెడ్డి వర్ధంతి

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి 29వ వర్ధంతిని మంగళవారం ఎర్రాతివారిపల్లెలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వగృహంలో నిర్వహించే కార్యక్రమాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పలువురు ప్రముఖులు, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభిమానులు హాజరు కానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి


మల్లప్ప (ఫైల్)

కుప్పంరూరల్: మండలంలోని క్రిష్ణదాసనపల్లెకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు భూలక్ష్మమ్మ భర్త మల్లప్ప(65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతదేహానికి జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈయన మృతిపై ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ సంతాపం వ్యక్తం చేశారు.

ఇంటర్ పరీక్షలకు 46 మంది గైర్హాజరు

పుంగనూరు: పట్టణంలో ఇంటర్మీడియెట్ తొలి సంవత్సరం పరీక్షలకు సోమవారం 46 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం మూడు సెంటర్లలో 823 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 46 మంది విద్యార్థులు హాజరుకాలేదని పర్యవేక్షణాధికారులు రెడ్డెప్ప, కమలాకర్, విజయకుమారి తెలిపారు.

వాహనాల వేలం


వాహనాలు వేలం వేస్తున్న సీఐ

పుంగనూరు: మద్యం తరలిస్తూ పట్టుబడిన 17 వాహనాలకు పట్టణంలోని ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వేలం వేశారు. వేలం పాటలో రూ.1.97 లక్షలు ఆదాయం వచ్చినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. నిధులను ఖజానాకు జమ చేశామన్నారు.

వెలుగు సీసీకి సన్మానం


కొండారెడ్డిని సత్కరిస్తున్న సంఘమిత్రలు

గంగవరం: వెలుగు మహిళా సమాఖ్య సీసీ కొండారెడ్డిని మండల సంఘమిత్రలు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది జనవరిలో రిపబ్లిక్ డే రోజున కలెక్టర్ నుంచి ఉత్తమ సీసీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏసీ హరినాథ్, ఏపీఎం నాగవేణి ఆధ్వర్యంలో సన్మానించారు.

పిచ్చుకలను కాపాడుకుందాం


నాటేందుకు తీసుకొచ్చిన మొక్కలు

పలమనేరు: సెల్‌ఫోన్ టవర్ల కారణంగా పిచ్చుకల మనుగడ ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో పిచ్చుకలను కాపాడుకోవాల్సిన అవసరం సమాజంపై ఉందని పలమనేరు ప్రకృతి నిర్వాహకుడు మల్లిచెట్ల దేవేంద్ర అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నేటి కాంక్రీట్ జమానాలో పిచ్చుకల మనుగడ ప్రమాదంలో పడిందన్నారు. మన వంతు సాయంగా నెట్‌వర్క్ సామర్థ్యాలను తగ్గించాలని, ప్రజలు అవసరం మేరకు నెట్ వాడాలని సూచించారు. ఇళ్ల వద్ద పిచ్చుకల కోసం గూళ్లను ఏర్పాటు చేయాలని కోరారు.

అప్రెంటిస్‌షిప్‌నకు 35 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జరిగిన ప్రధాన మంత్రి అప్రెంటిస్‌షిప్ మేళాలో పాల్గొన్న 35 మందికి మూడు సంస్థల్లో అవకాశం దక్కినట్లు ప్రిన్సిపల్ నగేష్ తెలిపారు. పాకాలకు చెందిన స్నామ్ అలాయ్స్, బెంగళూరుకు చెందిన హుందాయ్, తిరుపతి అమ్మా చారిటబుల్ ట్రస్టులలో వీరు అప్రెంటీస్‌గా విధులు నిర్వహిస్తారని చెప్పారు. స్థానిక విద్యార్థులతో పాటు చిత్తూరు, బంగారుపాళెం, కుప్పం ఐటీఐలకు చెందిన విద్యార్థులు ఈ మేళాలో పాల్గొన్నారని తెలిపారు.

గాండ్ల కులస్తుల నూతన కార్యవర్గం

పలమనేరు: జిల్లా గాండ్ల కులస్తుల నూతన కార్యవర్గ ఎంపిక సోమవారం తిరుపతిలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా భూపేష్, ఉపాధ్యక్షుడిగా గోవిందుస్వామి, ట్రెజరర్‌గా కృష్ణకుమార్, సంయుక్త కార్యదర్శిగా మురగేష్, కార్యవర్గ సభ్యులుగా ఏఆర్ కుమార్, వినాయకం, పయణి, తులసీనాథ్, విజయకుమార్, గౌరవాధ్యక్షుడిగా గిరిధరన్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నికపై పట్టణానికి చెందిన ఆ సంఘ నాయకుడు టీకే షణ్ముగం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

పేదలకు పండ్లు పంపిణీ


మాట్లాడుతున్న దళిత నేతలు

పుంగనూరు: ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్యాదీవెన పథకం కింద నగదు బదిలీ చేసిన నేపథ్యంలో దళిత నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం దళిత నాయకులు రాజు, కృష్ణప్ప, శంకరప్ప, గంగాధర్ ఆధ్వర్యంలో ఇందిరా సర్కిల్‌లో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

వేడుకగా గంగజాతర


సదుం: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

సదుం: మండలంలో గంగజాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాలమంద, రెడ్డివారిపల్లె, కంభంవారిపల్లె, చెరుకువారిపల్లెలో జాతర సందడి నెలకొంది. మండల కేంద్రంలో నడివీధిలో గంగమ్మను ప్రతిష్ఠించారు. వేకువజామునే మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా పిండిదీపాలతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఊరేగింపుగా అమ్మవారిని తీసుకెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది. బూరగమందలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి పూజలు చేశారు.

సోమలలో..

కందూరులో గంగమ్మ జాతర వేడుకగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కొత్తగా 14 ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో టీటీడీ నుంచి ఒక్కో గుడికి రూ.10 లక్షలు మంజూరు చేయించారన్నారు. శ్రీనివాసపురం, గువ్వలవారిపల్లె, చెరుకువారిపల్లె, మచ్చా హరిజనవాడ, సురేంద్రనగర్, రేణుమాకుల పల్లె, కుమ్మరపల్లె, బయ్యారెడ్డిగారిపల్లె, బయ్యారెడ్డిగారిపల్లె దళితవాడ, ఇర్లవారిపల్లె, గోపాలపురం, అయ్యావాండ్లపల్లె, రామిరెడ్డిగారిపల్లె, 102 ఈ రామిరెడ్డిగారిపల్లెల్లో గుడులను నిర్మిస్తారన్నారు. మరో పది ఆలయాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంపీడీఓ సుగుణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, మంత్రి పీఏ మునితుకారాం, నాథమునిరెడ్డి పాల్గొన్నారు.

పోషన్ పఖ్వాడా వారోత్సవాలను జయప్రదం చేద్దాం


అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు

రొంపిచెర్ల: పోషన్ పఖ్వాడా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి కోరారు. సోమవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో పోషన్ పఖ్వాడా వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల 3వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, 0–6 పిల్లలకు అందిస్తున్న పథకాలను వివరించడం కోసం ఈ కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అలివేలు, హసీనా, సంపత్‌కుమారి, లక్ష్మి, లావణ్య, రమణమ్మ, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం పంచాయతీకి పెరిగిన ఆదాయం

రామకుప్పం: మండల కేంద్రం రామకుప్పం పంచాయతీలో నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి స్వల్ప ఆదాయం పెరిగింది. సోమవారం స్థానిక గ్రామ సచివాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ, సర్పంచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేటు బస్టాండ్ గుత్త హక్కులకు వేలం పాట నిర్వహించారు. వారపు సంత రూ.2.60 లక్షలు, ప్రైవేటు బస్టాండ్ 2.40 లక్షలు, దినసరి మార్కెట్ రూ. 87,500లకు అనీస్ దక్కించుకున్నాడు. గత ఏడాది రూ.5.72 లక్షలు రాగా ఈ ఏడాది రూ. 5.87 లక్షలు వచ్చింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరవిప్రసాద్ పాల్గొన్నారు.



వేలంలో రూ.22.20 లక్షల ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

శాంతిపురం: బడుగుమాకులపల్లె వారపు సంతకు జరిగిన వేలం పాటలో పంచాయతీకి రూ.22,20,000 ఆదాయం లభించింది. కెనమాకులపల్లె గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ ఏవీ జయరాం, ఈఓపీఆర్డీ విజయదత్త, కార్యదర్శులు రవినాయక్, అశ్వతనారాయణ సోమవారం వేలం పాట నిర్వహించారు. సంత అంగళ్లకు రూ.5.55 లక్షలు, పశువుల సంతకు రూ.6.89 లక్షలు, ప్రైవేటు వాహనాల గేటుకు రూ.4.63 లక్షలు, కోళ్లు, గొర్రెల గేటు హక్కులను రూ.5.13 లక్షలకు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. గత ఏడాది రూ 23.20 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.లక్ష తగ్గింది.

సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్


మాట్లాడుతున్న అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ టాబ్స్ సాఫ్ట్‌వేర్ అండ్ ఏఆర్‌ఈ జీఎల్ఎస్ అనే అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఆరు రోజుల పాటు ఈ వర్క్‌షాప్ జరుగుతుందని కళాశాల కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. భూగర్భంలో ఉన్న ఖనిజాలను వెలికితీసే ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ పనితీరు, విధానాలపై విజయవాడలోని లెర్నెట్ స్కిల్స్ ప్రతినిధులు మురళీక్రిష్ణ, అనూష విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. సుమారు 90మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సునీల్, ఏడీ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు


సూచనలిస్తున్న డ్వామా ఏపీడీ

చౌడేపల్లె: ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ వరప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. గృహ నిర్మాణ పనులకు ఉపాధి పథకం అనుసంధానం చేసి 90 పని దినాలు కల్పించి ఆర్థిక చేయూతనివ్వాలని తెలిపారు. కొత్తగా మంజూరైన పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. భువన్ యాప్ ద్వారా పనుల వారీగా జియోట్యాగ్ చేసి మూడు రోజుల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో కూలీల లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా కొత్త పనులను గుర్తించి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. పండ్ల తోటల పెంపకం కోసం ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పంచాయతీల వారీగా లక్ష్యాలను అధిగమించడానికి తీసుకోవాల్సిన కార్యచరణపై చర్చించారు. ఏపీఓ శ్రీనివాసుల యాదవ్, జేఈ ధనుంజయుడు, టీఏలు అమరనాథ్, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖకు రూ.8.96 లక్షల నష్టం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో ఆదివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్స్, ఇన్సులేటర్లు, డిస్కులు దెబ్బతిన్నాయి. డివిజన్ పరిధిలో మొత్తం 12 స్తంభాలు, 32 ట్రాన్స్‌ఫార్మర్లు, 31 ఇన్సులేటర్లు, 14 డిస్కులు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్‌శాఖకు రూ.8.96 లక్షలు నష్టం వాటిల్లిందని ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై వివరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని

పలమనేరు: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్‌పక్వాడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు పోషకాహారాన్ని అందించే లక్ష్యంతో తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీల్లో పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మంచి పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం లత, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. స్వయంభు శ్రీ మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


రొంపిచెర్లలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


చౌడేపల్లెలో..

రొంపిచెర్ల: అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్లు చేసుకున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఎస్.నవాబ్‌సాబ్‌కు రూ.8 లక్షలు, కె.వెంకట్రామయ్యకు రూ.లక్ష, సరస్వతమ్మకు రూ.55 వేలు, గురబయ్యకు రూ.52 వేలు, అంకమ్మకు రూ.50 వేల చొప్పున చెక్కు అందజేశారు. బాధితుల విజ్ఞప్తి మేరకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులను మంజూరు చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డిశ్వర్ రెడ్డి, మంత్రి పీఏ మునితుకారం, సింగిల్‌విండో చైర్మన్ దేవులపల్లె హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీలు విజయశేఖర్, నూలు రెడ్డెప్ప, సర్పంచ్‌లు నాగిరెడ్డి, రమణయ్య, నాయకులు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, సూర్య నారాయణరెడ్డి, లక్ష్మయ్య, సురేంద్రనాయుడు, శ్రీనాథనాయుడు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో ముగ్గురికి రూ.2.40 లక్షలు

చౌడేపల్లె: మండలంలోని ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2.40 లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఇందులో చౌడేపల్లెకు చెందిన ఎస్.సిరాజ్‌కు రూ. 30 వేలు, సంతగేటు వీధికి చెందిన కె.ఏసు రూ. 60 వేలు, కాటిపేరికి చెందిన సీడీ సుబ్రమణ్యం రూ.1.50 లక్షల చొప్పున అందజేసినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, వరుణ్‌భరత్, సుజాత తదితరులు పాల్గొన్నారు.


పులిచెర్లలో...

పులిచెర్లలో ఏడుగురికి రూ.6.88 లక్షలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఏడుగురికి రూ.6.88 లక్షలను జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగ సిద్దులుకు రూ.50వేలు, దిగవమూర్తివారిపల్లెకు చెందిన రామచంద్రనాయుడుకు రూ.80వేలు, పోశంవారిపల్లెకు చెందిన గిరిజకు రూ.4లక్షలు, కల్లూరుకు చెందిన షేక్‌నస్రీన్‌కు రూ.28వేలు, కావేటి గారిపల్లె రఘునాథనాయుడుకు రూ.70వేలు, కల్లూరుకు చెందిన శ్రీనివాసరావుకు రూ.40వేలు, ఉప్పు వడ్డిపల్లె ఆనందయ్యకు రూ.20వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాథమునిరెడ్డి, ముర్వత్‌బాషా, షకూర్, ప్రభాకర్, దామోధర్, లోకేష్, ఆనంద, రాజమూర్తి పాల్గొన్నారు.

ఉగాదికి 3,334 గృహప్రవేశాలు


గూడూరుపల్లె వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టిడ్కో ఇళ్లు

పుంగనూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని జగనన్న కాలనీల్లో 3,334 గృహాలు ప్రారంభించనున్నారు. కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. లబ్ధిదారులు తమ గృహాలకు రంగులు వేసుకుని సిద్ధం చేసుకున్నారు. పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద 1536 టిడ్కో గృహాలు.. అలాగే జగనన్న కాలనీలో 694 గృహాలు, మండలంలోని జగనన్న కాలనీలో 1104 గృహాలను ప్రారంభించనున్నారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేశ్వరి పర్యవేక్షణలో గృహనిర్మాణాలు వేగవంతం చేశారు. ఈ విషయమై కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గృహాలు పండుగ రోజున ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులతో కలిసి పండుగ వాతావరణంలో గృహప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. కాలనీల్ల నీరు, రోడ్లు, కాలువలు, ఇతర సదుపాయాలను సుమారు రూ.20 కోట్లతో చేపట్టినట్లు వివరించారు.

మామిడిలో తెగుళ్ల నివారణకు చర్యలు

బంగారుపాళెం: మామిడి పంటలో తెగుళ్ల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి సూచించారు. తవణంపల్లె, బంగారుపాళెం, ఐరాల మండలాల్లో సోమవారం తిరుపతి ఉద్యాన పరిశోధనా స్థానం, చిత్తూరు డాట్ సెంటర్ కీటక శాస్త్రవేత్తలు శ్రీనివాసులురెడ్డి, రాఘవేంద్రతో కలసి మధుసూదన్‌రెడ్డి మామిడితోటలను పరిశీలించారు. నల్ల తామర పురుగు పంటను ఆశిస్తున్నట్లు గుర్తించారు. పురుగులు కాయలపై గోకడంతో గార ఏర్పడిందని తెలిపారు. వర్షం పడడంతో ఈ పురుగుల బెడద కొంత వరకు తగ్గిందని చెప్పారు. అయితే కాయ సైజు పెరగకుండా రాలిపోయి పంట నష్టపోతుందని చెప్పారు. గత సంవత్సరం ఈ పురుగు మిరపతోటలను ఆశించినట్లు గుర్తుచేశారు. రైతులు ముందు జాగ్రత్తగా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు నల్ల తామర పురుగు నివారణకు లీటరు నీటిలో అసిఫేట్ 1.5 గ్రాములు, వేపనూనె 2 ఎంఎల్, బావిస్టిన్ 1 గ్రాము మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాయలు ఎక్కువగా రాలిపోతున్న తోటల్లో ప్లానోఫిక్స్‌మందు 1 గ్రామును 4.5 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు.